

మధుర ఫలం!

- రోడ్డుపక్కన వెలుస్తున్న సీతాఫలాల దుకాణాలు
- డజన్ రూ.250 - రూ.300 చొప్పున విక్రయాలు


పాల్వంచ మెయిన్ రోడ్డు పక్కన సీతాఫలాలు విక్రయిస్తున్న దృశ్యం

పాల్వంచరూరల్: సీతాఫలాలు ఈసారి ముందుగానే మార్కెట్లోకి వచ్చాయి. సాధారణంగా అక్టోబర్‌లో రావాల్సిన సీతాఫలాల దిగుబడి ఈసారి అధిక వర్షాల కారణంగా ముందుగానే దిగుబడి వచ్చింది. ఇప్పుడిప్పుడే మార్కెట్‌లోకి రావడంతో సీతాఫలాల ధరలు మండుతున్నాయి. డజన్ రూ.250 నుంచి 300 చొప్పున వ్యాపారులు విక్రయిస్తున్నారు. పేదల యాపిల్‌గా, మధురఫలంగా పేరుగాంచిన సీతాఫలాలు చిన్నారుల దగ్గర నుంచి వృద్ధుల వరకు ఇష్టపడతారు. ఏజెన్సీ ప్రాంతమైన జిల్లాలోని పాల్వంచ, కొత్తగూడెం, ఇల్లెందు, భద్రాచలం తదితర ప్రాంతాల్లో రోడ్ల పక్కన చిరువ్యాపారులు దుకాణాలు ఏర్పాటు చేశారు. ఈ ఏడాది వర్షాలు అధికంగా కురవడం సీతాఫలాల చెట్లు విరివిగా కాయడంతో చిరువ్యాపారులు తీసుకొచ్చి విక్రయిస్తున్నారు.

గ్రామీణులకు ఉపాధి అవకాశం...

సీతాఫలాల సీజన్‌లో ప్రతీ సంవత్సరం గ్రామీణ ప్రాంత ప్రజలకు ఉపాధి లభిస్తుంది. అడవి ప్రాంతంలో మాత్రమే ఉండే సీతాఫలాల చెట్లు ప్రతీఏటా దసరాకు పక్వానికి వస్తాయి. వాటిని గ్రామీణ ప్రాంతాల చిరువ్యాపారులు సేకరించి విక్రయించి ఉపాధి పొందుతున్నారు.

సండే స్పెషల్

రసాయనాలు వాడని పండు సీతాఫలం..

మార్కెట్‌లో లభించే అన్నిపండ్లకు వ్యాపారులు రసాయనాలను వినియోగిస్తారు. కానీ ఒక్క సీతాఫలానికి మాత్రం ఎలాంటి రసాయనాలు వినియోగించకుండా పండ్లను విక్రయిస్తుంటారు. ఈ పండ్లకు రసాయనాలు వినియోగిస్తే ఒక్కరోజులోనే పాడయ్యే అవకాశం ఉంటుంది. వీటిని సహజంగా పండించడం సులువు కావడంతో రసాయనాల భయం లేకుండా తినవచ్చు.

పెరిగిన ధరలు..

సీతాఫలాల ధరలు గతంలో కంటే ఈసారి అధికంగా ఉన్నాయి. గత ఏడాది డజను రూ.150 నుంచి 200 విక్రయిస్తే, ఈసారి రూ.250 నుంచి 300 చొప్పున విక్రయిస్తున్నారు. సీజన్ పండ్లు కావడంతో ఎక్కువ మంది వీటిని ఇష్టపడుతుంటారు. దీంతో వ్యాపారులు ధరలు పెంచి అమ్ముతున్నారు.


తోపుడు బండిపై...

సీతాఫలం అరోగ్య ప్రదాయిని...

సీతాఫలం ఆరోగ్యానికి మంచిందని వైద్యులు చెబుతున్నారు. వీటిని తినడం వలన మలబద్ధకం, రక్తహీనత తదితర సమస్యలను విముక్తి లభిస్తుంది. సీతాఫలంలో సీ విటమిన్ అధికంగా ఉండటంతో జీర్ణ సంబంధిత సమస్యలు కూడా తొలగిపోతాయి. శరీర క్షణకు కావాల్సిన పోషకాలు వీటిలో ఉండటంతో ఆరోగ్యంగా ఉంటారని వైద్యులు సూచిస్తున్నారు.

క్లుప్తంగా

ఎస్‌ఐను అభినందించిన ఎస్పీ రోహిత్‌రాజు



ప్రశాంసాపత్రం అందుకుంటున్న రాణాప్రతాప్

జూలూరుపాడు: మాదక ద్రవ్యాల నియంత్రణ, సమాజ శ్రేయస్సే లక్ష్యంగా కార్యాచరణ ప్రణాళికతో ముందుకెళ్తున్న జూలూరుపాడు ఎస్‌ఐ రాణాప్రతాప్‌కు శనివారం జిల్లా ఎస్పీ రోహిత్‌రాజు ప్రశంసాపత్రం అందజేసి అభినందించారు. తెలంగాణ రాష్ట్ర యాంటీ నార్కోటిక్స్ బ్యూరో (టీనాబ్) డైరెక్టర్ సందీప్ శాండిల్య ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల నియంత్రణకు ఎస్‌ఐ చర్యలు చేపట్టారు.

వేతనాల పెంపునకు సహకరించండి..

ఇల్లెందురూరల్: సుదీర్ఘకాలంగా పొదుపు సంఘాల అభ్యున్నతికి శ్రమిస్తున్న తమకు వేతనాల పెంపు, విధుల క్రమబద్ధీకరణ విషయంలో చిన్నచూపుకు గురవుతున్నామని మండలంలోని వీఓఏలు ఎమ్మెల్యే కోరం కనకయ్యకు తమ గోడు వెళ్లబోసుకున్నారు. ఈ మేరకు శనివారం ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. మాట్లాడుతూ.. ఇచ్చిన హామీలను నెరవేర్చేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు.

ముగిసిన క్రీడాపోటీలు

టేకులపల్లి: మండల స్థాయి అండర్ 14, అండర్ 17 బాలురు, బాలికల పాఠశాల క్రీడాపోటీలు శనివారం ముగిశాయి. టేకులపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, అథ్లెటిక్స్ పోటీలలో విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. విజేతలకు మండల విద్యాశాఖ అధికారి ఠాకూర్ రాంసింగ్ బహుమతులు అందజేశారు.

భజన మందిరం ఈఓగా సులోచన


బాధ్యతలు స్వీకరిస్తున్న సులోచన

కొత్తగూడెంటౌన్: పట్టణంలోని పాండురంగ భజన మందిరం ఈఓగా కె.సులోచన శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఈఓగా విధులు నిర్వహించిన హరిచంద్రశేఖర్ నుంచి బాధ్యతలు తీసుకున్నారు. ఆమె మాట్లాడుతూ.. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూస్తానన్నారు.

క్రికెట్ కిట్లు పంపిణీ

ఇల్లెందురూరల్: పీఎస్‌ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సుభాష్‌నగర్ హైస్కూల్‌లో శనివారం విద్యార్థులకు రెండు క్రికెట్ కిట్లను కాంగ్రెస్ నాయకులు నాలవెల్లి నర్సింహారావు, ఊరకొండ ధనుంజయ్ శనివారం అందజేశారు.

అధికారాలను హరించేందుకే 'జమిలి'


మాట్లాడుతున్న కనకయ్య

ఇల్లెందు: కేంద్రం తీసుకొస్తున్న జమిలి ఎన్నికలు సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధమని, ఆయా రాష్ట్రాల అధికారాలను హరించడమేనని సీపీఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం ఇల్లెందులోని పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. జమిలి ఎన్నికల విధానాన్ని సీపీఎం వ్యతిరేకిస్తుందన్నారు. మోదీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు ఊడిగం చేస్తూ ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తోందన్నారు. నబీ, తాళ్లూరి కృష్ణ, మోహన్‌రావు, ఆలేటి కిరణ్, సుల్తానా, రాందాస్, హుస్సేన్, వెంకన్న పాల్గొన్నారు.

రాళ్లవాగు కాలువలో సిల్ట్ తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..

పాల్వంచరూరల్: ఇటీవల కురిసిన భారీవర్షాలకు రాళ్లవాగు పికప్ డ్యామ్ పక్కన కోతకు గురై కుడికాలువ పొడవున మట్టి, ఇసుక పేరకపోవడంతో పంటపొలాలకు సాగునీరు అందడం లేదు. దీనిపై ఈనెల 19న 'ఇసుకతో నిండిన పంట కాలువ' శీర్షికన సాక్షి దినపత్రిక వార్త ప్రచురితమైంది. దీనికి జలవనరులశాఖ అధికారులు స్పందించారు. ఈ మేరకు ఏఈఈ ఊర్మిళ పర్యవేక్షణలో రాళ్లవాగు పికప్ డ్యామ్ కుడి కాలువలో పేరుకపోయిన ఇసుక, మట్టిని శనివారం కూలీలతో శుభ్రం చేయించారు. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు.

విద్యార్థుల పోరాటాలు అనిర్వచనీయం


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): సమాజ మార్పులో విద్యార్థుల పోరాటాలు అనిర్వచనీయమని ఖమ్మం జిల్లా పీడీఎస్‌యూ మాజీ నాయకుడు, గ్రామీణ వైద్యుల సంఘం నాయకుడు కండె లక్ష్మీనారాయణ అన్నారు. ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) 50 వసంతాల సందర్భంగా, అక్టోబర్ 12, 13 తేదీలలో నిర్వహించనున్న మహాసభ నిర్వహించనున్నారు. ఈమేరకు శనివారం కొత్తగూడెంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. మాట్లాడుతూ.. తెలంగాణ సాయుధ పోరాటం, నక్సల్బరీ, శ్రీకాకుళం గిరిజన పోరాటాలు, జాతీయ ఉద్యమ నాయకుల స్ఫూర్తితో శాస్త్రీయ విద్యా సాధనకై, సమసమాజ స్థాపన లక్ష్యంతో పీడీఎస్‌యూ ఏర్పడిందన్నారు. ఈ మహాసభకు విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కే.సింధు, జే.గణేష్, భరత్, వివేక్, గౌతమి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

రేపో మాపో.. మార్కెట్‌కు కొత్త కమిటీ

ఇల్లెందు: ఇల్లెందు మార్కెట్ కమిటీకి నూతన పాలకవర్గం ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నాయి. నేడో రేపో కొత్త అధ్యక్షుడిని ప్రకటించనున్నారు. రెండేళ్ల నిరీక్షణకు తెర పడనుంది. నాటి ఎమ్మెల్యే హరిప్రియ ఐదేళ్ల కాలంలో ఒక్కసారే చైర్మన్ ఎంపిక జరిగింది. ఆ పదవిలో ఆమె భర్త హరిసింగ్‌ను నియమించారు.

అంతకు ముందు ఎమ్మెల్యేగా పనిచేసిన కోరం కనకయ్య హయాంలో కూడా ఒకే ఒక్కసారి గార్లకు చెందిన భూక్యా నాగేశ్వరరావును నియమించారు. ఇప్పుడు మళ్లీ ఎమ్మెల్యేగా కోరం కనకయ్య హయాంలో మరోమారు మార్కెట్ కమిటీకి కొత్త పాలకవర్గం రాబోతోంది. ఇప్పుడు మాణిక్యారం మాజీ ఎంపీటీసీ బానోతు రోజా భర్త బానోతు రాంబాబుకు ఆ కుర్చీ దక్కే చాన్స్ ఉంది. ఇప్పటికే ఎమ్మెల్యే నూతన పాలకవర్గం కోసం ప్రతిపాదనలు పంపారు. ఇక మార్కెట్ కార్యాలయం నుంచి జరగాల్సిన ప్రక్రియ పూర్తి చేశారు. ఏ క్షణమైనా నూతన పాలకవర్గం ప్రకటన వెలువడనుంది.

14 మందితో ప్రతిపాదన..

ఇల్లెందు మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం 14 మందితో ఏర్పాటు కానుంది. నూటికి నూరు శాతం గిరిజనులతో ఏర్పాటయ్యే ఈ కమిటీలో నలుగురు ఎక్స్ అఫీషియో సభ్యులు, ఇద్దరు ట్రేడర్స్ సభ్యులుగా ఉంటారు. ఎనిమిది మండలాల నుంచి సభ్యులను ఎంపిక చేసి ప్రభుత్వానికి పంపించారు.

విద్యార్థులకు బహుమతులు


విద్యార్థి, తల్లిదండ్రులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

టేకులపల్లి: టేకులపల్లి మండలంలోని ప్రభుత్వ, మండల పరిషత్, జిల్లా పరిషత్, గిరిజన ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో శనివారం పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ (పీటీఎం) సమావేశాలు నిర్వహించారు. బొమ్మనపల్లి ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎం జ్యోతిరాణి వంద శాతం హాజరు ఉన్న విద్యార్థులకు నూతన దుస్తులు, ఇతర సామగ్రి బహుమతిగా అందించడంతో వారి తల్లిదండ్రులను శాలువాతో సన్మానించారు.

మహాత్ములను ఆదర్శంగా తీసుకోవాలి


గురజాడకు నివాళులర్పిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

ఇలెలదురూరల్: మహాత్ములను ఆదర్శంగా తీసుకుని ఉన్నత విలువలతో ఎదిగేందుకు శ్రమించాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రావు సూచించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం కొండా లక్ష్మణ్ బాపూజీ 12వ వర్ధంతి, గురజాడ అప్పారావు 162వ జయంతిని నిర్వహించారు. వారి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. మాట్లాడుతూ.. చరిత్ర మనిషి ఉన్నతికి మార్గం చూపిస్తుందని, సదుద్దేశ్యంతో ఆ మార్గంలో పయనిస్తే సత్ఫలితాలు ఉంటాయని చెప్పారు.

23న తహసీళ్ల ఎదుట ధర్నా


మాట్లాడుతున్న ప్రసాద్

టేకులపల్లి: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని, ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేయాలని తదితర డిమాండ్లతో జేఏసీ ఆధ్వర్యంలో కార్మికశాఖ కార్యాలయాలు, తహసీళ్ల ఎదుట ఈనెల 23న నిర్వహించనున్న ధర్నాలను జయప్రదం చేయాలని జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం మండల కేంద్రంలోని ఏఐటీయూసీ కార్యాలయంలో ఇఫ్టూ రాష్ట్ర నాయకుడు దుబాకుల ప్రసాద్ మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్లకు అనుకూలమైన నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చి కార్మికవర్గానికి తీవ్ర అన్యాయం చేశారని విమర్శించారు. వీటిని కార్మిక వర్గం ఐక్యంగా ఉద్యమించి తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర జేఏసీ పిలుపులో భాగంగా ఈనెల 23న టేకులపల్లి తహసీల్ ఎదుట జరగనున్న ధర్నాకు సంఘటిత, అసంఘటిత రంగ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఏఐటీయూసీ, సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ నాయకులు గుగులోతు రామచందర్, కడుదుల వీరన్న, బోడ మంచ తదితరులు పాల్గొన్నారు.

రైతులందరికీ రుణమాఫీ వర్తింపజేయండి..

ఇల్లెందురూరల్: రైతులందరికీ రుణమాఫీ వర్తింపజేసేలా ప్రభుత్వాన్ని మేల్కొల్పాలని కోరుతూ బీఆర్‌ఎస్ నాయకులు, రైతులు శనివారం పోస్టు కార్డు ద్వారా రాష్ట్ర గవర్నర్‌కు వినతిపత్రాలు పంపారు. రొంపేడు గ్రామంలో రుణమాఫీ వర్తించని 55 మంది రైతులతో బీఆర్‌ఎస్ నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆజ్మీర భావ్‌సింగ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ నాయకత్వం ఎన్నికల సమయంలో ప్రకటించిన విధంగా రైతులందరికీ రుణమాఫీ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. అరకొరగా రుణమాఫీ చేసి గొప్పలు చెప్పుకుంటున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో కాసాని హరిప్రసాద్, రాంబాబు, బానోత్ బాల, వాంకుడోత్ వీరన్న, సారయ్య, మోతీలాల్ పాల్గొన్నారు.

మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి



మాట్లాడుతున్న మల్లు లక్ష్మి

సింగరేణి(కొత్తగూడెం): మహిళలు అన్నిరంగాల్లో రాణించాలని, ఐద్వా రాష్ట్ర కార్యదర్శి మల్లు లక్ష్మి పిలుపునిచ్చారు. మంచికంటి భవన్‌లో శనివారం జరిగిన ఐద్వా జిల్లా మూడో మహాసభలో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఆమె మాట్లాడుతూ.. మహిళల హక్కుల పరిరక్షణ, బాలికల విద్యకు విఘాతం కలిగించే నూతన విద్యా విధానాన్ని రద్దు చేయాలని, ఉపాధి హామీ పథకాన్ని కట్టుదిట్టంగా అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదేవిదంగా అధిక ధరలను అరికట్టాలని, ప్రజాపంపిణీ వ్యవస్థను పటిష్టం చేయాలని చెప్పారు. మహిళా సమస్యలు పరిష్కరించేలా మహిళా సాధికారతే లక్ష్యంగా ప్రభుత్వాల కార్యచరణ ఉండాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత మహిళల ఉపాధి దారుణంగా పడిపోయిందన్నారు. ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బుగ్గవీటి సరళ, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వాణి, ఇందిరా, శ్రీలక్ష్మి, ఎస్.లక్ష్మి, గంగ, సరోజిని, సంధ్య, జయ, లీలావతి, అమల తదితరులు పాల్గొన్నారు.

చెరువు అభివృద్ధికి సహకరిస్తా..


చెరువు కట్టను పరిశీలిస్తున్న తాండ్ర వినోద్‌రావు

సుజాతనగర్: సింగభూపాలెం చెరువు అభివృద్ధికి తోడ్పాటు అందిస్తానని బీజేపీ ఖమ్మం ఎంపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు అన్నారు. శనివారం సుజాతనగర్ మండలంలోని సింగభూపాలెం చెరువు కరకట్టను ఆదివారం ఆయన పరిశీలించి ఇరిగేషన్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సింగభూపాలెం చెరువును పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసేందుకు అవకాశాలు పుష్కలంగా ఉన్నట్లు చెప్పారు. చెరువు అభివృద్ధికి తనవంతు తోడ్పాటు అందిస్తానని చెప్పారు. సెంట్రల్ టూరిజం మినిస్టర్‌తో మాట్లాడి తెలంగాణ ప్రభుత్వ సమన్వయంతో ముందుకెళ్తానన్నారు. అనంతరం మండలంలోని వివిధ గ్రామాలలో పర్యటించి తుఫాన్ కారణంగా పంట నష్టపోయిన రైతులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో నరేంద్రబాబు, బుడగం రవి, జల్లారపు శ్రీను, భూక్యా రాజేష్ నాయక్, గుగులోతు రమేష్ బాబు, బొడ్డు బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

పెద్దమ్మగుడికి పెరిగిన ఆదాయం

పాల్వంచరూరల్: పెద్దమ్మగుడి వద్ద శనివారం జరిగిన బహిరంగ వేలంపాటలో వ్యాపారులు పోటీ పడ్డారు. దీంతో ఆలయానికి గణనీయంగా ఆదాయం పెరిగింది.

కేశవాపురం, జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువై ఉన్న శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయంలో ఆలయానికి చెందిన నూతన కాంప్లెక్స్‌లోని 1, 2, 11 నంబర్ల షాపులను మూడు సంవత్సరాల కాలపరిమితికి, పాత కాంప్లెక్స్‌లోని 3వ నంబర్ షాపు, తలనీలాలు పోగు చేసుకునేందుకు, గతంలో సేకరించిన తలనీలాలను విక్రయించేందుకు, పూలు, పూలదండలను విక్రయించుకునేందుకు, ఫొటోలు తీసుకునేందుకు 11నెలల కాలపరిమితికి వేలంపాటలను దేవాదాయ, ధర్మాదాయశాఖ కొత్తగూడెం డివిజన్ పర్యవేక్షణాధికారి పి.బేల్‌సింగ్, ఈఓ ఎన్.రజనీకుమారిల ఆధ్వర్యంలో నిర్వహించారు. గతంలో కంటే రూ.4.70 లక్షల ఆదాయం పెరిగింది.

అందరికీ లాభాల వాటా వర్తింపజేయండి..


మాట్లాడుతున్న వెంకన్న

టేకులపల్లి: సింగరేణిలో ఓబీతో పాటు ఇతర అన్ని విభాగాల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు లాభాల వాటా వర్తింపజేయాలని ప్రగతిశీల సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా నేత పాయం వెంకన్న, ఐఎఫ్‌టీయూ జిల్లా నేత జర్పుల సుందర్ సింగరేణి యాజమాన్యాన్ని, ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం యూనియన్ ఆధ్వర్యంలో టేకులపల్లి హైటెక్ కాలనీ, కేఓసీ ప్రాజెక్ట్ ఆఫీస్ వద్ద కాంట్రాక్ట్ కార్మికుల సమావేశం నిర్వహించారు. మాట్లాడుతూ.. సింగరేణిలో కాంట్రాక్ట్ కార్మికులకు లాభాలు ప్రకటించడం హర్షణీయమని, కానీ వేతనాలు పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో మదార్, షేక్ షఫీ, సైదులు, బాలు, జ్యోతి, నాగమణి, నవీన్, రవి, అవినాష్, వీరయ్య, ఉప్పయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం పునరాలోచన చేయాలి

జూలూరుపాడు: తెలుగు విశ్వవిద్యాలయానికి పొట్టి శ్రీరాములు పేరు తొలగించాలని నిర్ణయించడం సరైంది కాదని, దీనిపై ప్రభుత్వం పునరాలోచన చేయాలని ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర నాయకుడు పెండ్యాల విజయభాస్కర్ అన్నారు. శనివారం జూలూరుపాడులో మాట్లాడుతూ... భాషా ప్రయుక్త రాష్ట్రం కోసం పొట్టి శ్రీరాములు ప్రాణత్యాగం చేశారన్నారు. తెలుగు వారికి ప్రత్యేక రాష్ట్రం కావాలని, తెలుగు వారి ఆత్మగౌరవాన్ని కాపాడిన, స్వాతంత్ర్య ఉద్యమంలో చురుకుగా పాల్గొన్న మహనీయుడు పొట్టి శ్రీరాములు అన్నారు. తెలుగు విశ్వ విద్యాలయానికి పొట్టి శ్రీరాములు పేరును మార్చాలనే నిర్ణయం ఆర్యవైశ్యులు, తెలుగు భాషాభిమానులు తీవ్రంగా ఖండిస్తున్నారని పేర్కొన్నారు.

రాష్ట్ర మహాసభకు తరలిరండి..


ప్రచారం చేస్తున్న నాయకులు

జూలూరుపాడు: ఆది, సోమవారం కొత్తగూడెంలో జరగనున్న తెలంగాణ రాష్ట్ర ఆటో, క్యాబ్, ప్రైవేట్ మోటార్ డ్రైవర్స్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) 3వ రాష్ట్ర మహాసభలకు ఆటోడ్రైవర్లు తరలిరావాలని ఆటో వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) మండల కార్యదర్శి నిమ్మటూరి లచ్చయ్య పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలోని పాపకొల్లు క్రాస్ రోడ్, చంద్రుగొండ క్రాస్ రోడ్ ఆటో అడ్డాల వద్ద రాష్ట్ర మహాసభల విజయవంతాన్ని కోరుతూ ప్రచారం చేశారు. గార్లపాటి శివకృష్ణ, గార్లపాటి వీరభద్రం, పానుగంటి మహేష్, శివ, దానేలు, రామారావు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వైద్యశిబిరం నిర్వహించండి..


జ్వరంతో బాధపడుతున్న బాలుడు

జూలూరుపాడు: గుండెపుడి పంచాయతీ వీరభద్రాపురం గ్రామంలో గిరిజనులు విషజ్వరాలతో మంచం పట్టారు. మూడు వారాలుగా జ్వరాలతో విలవిలలాడుతున్నారు. ఏ ఇంటి గడపతొక్కినా జ్వర బాధితులే. ప్రతీ ఇంట్లో ఒకరు లేక ఇద్దరు లేదంటే ఇంటిల్లిపాదీ జ్వరంతో బాధపడుతున్నారు. జ్వరం, జలుబు, దగ్గు, తలనొప్పి, కీళ్ల నొప్పులు, కాళ్లు, చేతుల వాపు వంటి లక్షణాల కారణంగా తీవ్ర అస్వస్థతతో ఇబ్బంది పడుతున్నారు. కూలీ పనులపై ఆధారపడి జీవనం సాగించే గిరిజనులు జ్వరాల బారినపడటంతో ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందాల్సి రావడంతో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నట్లు బాధితులు వాపోతున్నారు. వీరభద్రాపురంలో 30 గిరిజన కుటుంబాలు నివసిస్తున్నాయి. దోమల నియంత్రణకు అధికారులు చర్యలు చేపట్టకపోవడంతో రాయింబవళ్లు దోమల రొద భరించలేకపోతున్నామని గిరిజనులు వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ విషయంపై పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వెంకటేశ్వర్లును వివరణ కోరగా.. వీరభద్రాపురంలో జ్వరబాధితులకు మెరుగైన వైద్యసేవలు అందించేవిధంగా చర్యలు తీసుకుంటామన్నారు.

ఘనంగా పోషకాహార వారోత్సవాలు


ఇల్లెందు: వెంగళరావునగర్‌లోని అంగన్‌వాడీలో సీమంతం నిర్వహిస్తున్న దృశ్యం



ఇల్లెందురూరల్: 21పిట్ ఏరియాలో సీమంతం చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు


టేకులపల్లి: వెంకట్యాతండా అంగన్‌వాడీలో ప్రతిజ్ఞ చేస్తున్న తల్లులు, పిల్లలు

ఇల్లెందు: పట్టణంలోని 15వ వార్డు వెంగళరావు నగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం ఘనంగా పోషకాహార వారోత్సవం నిర్వహించారు. చిన్నారులకు అన్నప్రాసన, గర్భిణులకు సీమంతం నిర్వహించి, పోషకాహారంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ అరుణకుమారి, సూపర్‌వైజర్ రోహిణి, చైల్డ్ ప్రొటెక్షన్ సభ్యులు భారతి, గాయత్రీ పరివార్ నుంచి అనితా ఖండేల్‌వాల్, అంగన్‌వాడీ టీచర్లు శారద, తారాబాయి, సుధారాణి, సుజాత, రజిత తదితరులు పాల్గొన్నారు.

ఇల్లెందురూరల్: ఆహారంలో పౌష్టికాహారం ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని ఐసీడీఎస్ ఇల్లెందు ప్రాజెక్ట్ సీడీపీఓ అరుణకుమారి సూచించారు. మండలంలోని 21పిట్ ఏరియాలోని అంగన్‌వాడీ పాఠశాలల్లో శనివారం పోషణ మాసోత్సవం నిర్వహించారు. మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలతోపాటు చిన్నారులు కూడా సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండేందుకు అంగన్‌వాడీ పాఠశాలల్లో అందించే ఆహారాన్ని తీసుకోవాలని కోరారు. అనంతరం గర్భిణులకు సీమంతం చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ ఉపాధ్యాయులు కారం పద్మ, అంజలిమేరి, శ్రీలత, జి.పద్మ, సుమతి, కృష్ణవేణి, ఉమాబాయి, ఆదెమ్మ, ఏఎన్‌ఎం అనసూర్య, ఎల్.కుమారి తదితరులు పాల్గొన్నారు.

టేకులపల్లి: పోషణ మాసోత్సవంలో భాగంగా శనివారం టేకులపల్లి సెక్టార్ సూపర్‌వైజర్ కె.అనురాధ ఆధ్వర్యంలో బేతంపూడి గ్రామ పంచాయతీలో వేడుకలు నిర్వహించారు. సీడీపీఓ కేఎం తార పాల్గొని గర్భిణులు, బాలింతలకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. వయస్సుకు తగిన బరువు, ఎత్తు లేని పిల్లలకు బాలామృతం, ప్లస్ ఇస్తున్నామని తెలిపారు. అనంతరం చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం చేశారు. గర్భిణులకు సీమంతం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు లలిత, సుగుణ, అరుణ, వెంకటనర్సమ్మ, భద్రమ్మ పాల్గొన్నారు.

పాల్వంచరూరల్: గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకోవడం ద్వారానే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని సీడీపీఓ లక్ష్మీప్రసన్న అన్నారు. కేశవాపురంలో శనివారం అంగన్‌వాడీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. మాట్లాడుతూ... తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువలు ఉన్న ఆహారం తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎంలు రాంబాబు, అనురాధ, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.